రాచపుండు

వి. ప్రతిమ

"రాజేశ్వరీ... ... ... రా...జేశ్వ...రీ," రెండో పిలుపు విరుపుల్తో కఠినంగా ఉంది. వంటగదిలో సాంబారుకి తాళింపు పెడ్తోన్న రాజేశ్వరి ఆ గర్జనకి గజగజా వణికి పోయింది.

ఒక భూకంపమేదో ఫెళఫెళమంటూ కాళ్ల కింది నుండి పాక్కుంటూ వెళ్లింది. ఎన్నో ఏళ్ల క్రితం మామ గారు కట్టించిన ఇంటిగోడలు నెర్రెలు వారినట్టయింది. వంటింట్లోకాక నిప్పుల గుండంలో నిలబడ్డట్టుగా వుంది రాజేశ్వరికి. తాళింపుకని పెట్టిన బాణలి మాడిపోతోంది. స్టౌ ఆర్పాలన్న ఆలోచన కూడా రాలేదామెకి.

"రాజేశ్వరీ...జేశ్వరీ...ఈశ్వరీ," భర్త పిలుపు వలయాలు వలయాలుగా ఆ హాల్లో రీసౌండ్‌లో విన్పి స్తోంది. పదిహేనేళ్ల వైవాహిక జీవితంలో భర్త అంత కోపంగా ఉండడం ఎప్పుడూ చూడలేదు రాజేశ్వరి. అంటే చంద్రారెడ్డికి కోపం రాదని కాదు. అతడికి కోప మెక్కువైనపుడు మౌనమనే ఆయుధంతో వేధిస్తాడే తప్ప తీవ్రమైన మాటలతో కాదు. ఇంటా బయటా ఎవరిమీద కోపమొచ్చినా అతడంతే... అటువంటిది?

అయితే ఇటువంటి ఒక పరిస్థితి గురించి గత మూడురోజులుగా సిద్ధపడే ఉందామె. భర్త హైదరా బాదు నుండి ఈ ఉదయం దిగినప్పటి నుండీ మరీ ఎక్కువగా...

"విజయుడు నామినేషనేశాడా?" గర్జించాడు చంద్రారెడ్డి.

నేలకంటుకుపోయిన పాదాల్ని పెకలించి హాల్లో కెళ్దామని రాజేశ్వరి అనుకుంటుండగానే పెద్దపెద్ద అంగ లతో వంటగది గుమ్మం వద్ద కొచ్చేశాడతను. భార్య మౌనం మరింత రెచ్చగొట్టినట్లుగా కళ్లు పెద్దవిచేసి కోపంగా అదే మాటల్ని పునశ్చరణ చేశాడు రెడ్డి. అతడి దవడ నరాలు ఉబ్బి ఉన్నాయి. గొంతులో అంతులేని కాఠిన్యం విన్పించింది...

తెలీదంటే అతడు నమ్మడు. తెలుసునంటే అన్నీ నీకు తెలిసే జరగతుండాయన్నమాట అంటాడు... గమ్మునుంటే ఊరాపేరా? పంచాయితీ ఎలక్షన్లొచ్చాయి. రాకపోతే పార్టీలకీ, వాటిని నమ్ముకున్న నాయకులకీ జరుగుబాటయ్యేదెట్లా? ఖర్మ... ఈ ఎలక్షన్లు తన చావు కొచ్చినట్టుండాయి అనుకుంది రాజేశ్వరి.

అయితే రాజేశ్వరి అదృష్టమో, దురదృష్టమో తెలీదుకాని, ఆమె సమాధానంకోసం ఎదురుచూడ కుండా వచ్చినంత పెద్ద అంగలతోనూ హాల్లోకి వెళ్లా డతడు... ఎదురుచూసిన ఉత్పాతమేదో ఎవరో అర చేయి పెట్టి ఆపినట్లుగా పెద్దగా ఊపిరి తీసుకుంది రాజేశ్వరి. అయితే అతడలా మౌనంగా తిరిగి వెళు తూంటే ఆమె గుండెలు దిగులుతోనూ, బాధతోనూ వేగంగా కొట్టుకున్నాయి. మాడిపోయిన బాణలి నుండి కమురు వాసన ఆమె శ్వాసకోశాల్లో చేరి పొడిదగ్గుతో ఇబ్బంది పెట్టింది.

చంద్రారెడ్డి హాల్లోకి రావడంచూసి, అక్కడ కూర్చున్న హరిబాబు, రామిరెడ్డి, బుజ్జిశెట్టి లేచి నిల్చు న్నారు. రామిరెడ్డి చనువుగా అతని వెనుకనే పడగ్గది వరకు నడిచాడు.

గుమ్మం వద్ద క్షణకాలం ఆగి, భావం లేకుండా రామిరెడ్డికేసి చూశాడు చంద్రారెడ్డి.

"నన్ను... నన్ను కాసేపు ఒంటరిగా ఉండని వ్వండి," ఈ మాటలు అనడానికి సర్వశక్తులూ కూడ

దీసుకున్నట్లుగా ఉన్నాడతడు. ఆ తర్వాత తన ముఖం లో భావాలని రామిరెడ్డి గమనించకుండా లోపలికెళ్లి తలుపేసుకున్నాడు.

"ఇన్నేళ్లనుండీ తెలుసు మనకు. అన్ననీ మాదిరిగా ఎప్పుడూ చూడలేదు," దిగులుగా అన్నాడు హరిబాబు.

"అయితే చిన్న విషయమా? ఎక్కడో పల్లెటూర్లో ఉన్నోడిని టౌన్‌కు పిలిపించి, క్యాసెట్ల అంగడి పెట్టించాడు అన్న... వాడు ముందు మ్యూజికల్స్ అన్నాడు వెనక కాంట్రాక్టులన్నాడు... ఆ తర్వాత రొయ్యల గుంటలు పెట్టినాడు."

'సర్లే... రే... దేనికైనా ఉండాలండీ... సారాయి అంగట్లో మాత్రం తక్కువ సంపాయిచ్చినాడా? దేంట్లో చెప్పు వాడికి కలిసిరాంది? రూపాయి పెడితే పది రూపాయలుగా తిరిగి వచ్చేస్తుండే... అన్ని యాపారాల్లోనూ పార్టనర్సే మళ్లీ..." రెట్టించాడు బుజ్జిశెట్టి.

"అందుకే కదా... ఆ బటువు చూసుకునే అన్న మీదనే నామినేషన్ ఏసేసినాడు..." ఒక్కొక్క మాటా విరిచి విరిచి కసిగా అన్నాడు రామిరెడ్డి. ఇంద్రారెడ్డి తండ్రి రాఘవరెడ్డి హయాం నుండి కూడా ఈ కుటుంబాన్నే కనిపెట్టుకుని మంచి, చెడుల్లో భాగమైనవాడు రామిరెడ్డి. అందుకే చంద్రారెడ్డిని వదల్లేక వెళ్లి సోఫాలో కూలబడ్డాడు.

చంద్రారెడ్డి లోపలికెళ్లి తలుపు మూసుకున్నాడే కానీ మనసు తలుపులు వేయలేకపోయాడు.

తను నీళ్లు పోసి, ఎరువేసి పెంచిన మొక్క మహావృక్షమై తనమీదకే పెళపెళా విరుచుకుపడ్డట్టుగా వుంది. తను పాలుపోసి పెంచిన కుక్క తన మీదకే మోరెత్తి మొరుగుతున్నట్లుగా ఉంది. రాజకీయాల్లో నీతి, అవినీతి, మంచి చెడ్డా అన్నా తమ్ముడూ, ముందు వెనుకా ఏమీ లేవని ఎంత సరిపెట్టుకో చూసినా అతడివల్ల కావడంలేదు.

కలగాపులగమైన ఆలోచనలతో నిండిపోయిన మెదడు వత్తిడికి తట్టుకోలేక పేలడానికి సిద్ధంగా వుంది. ఎప్పటెప్పటివో సంగతులు దృశ్యాలు దృశ్యాలుగా ముందుకూ వెనక్కూ కదులుతున్నాయి. ఏదీ నిలకడగా ఉండడం లేదు. మనసులో అల్పపీడనమేదో ఏర్పడ్డట్టుగా ఉంది.

అయితే ఇవన్నీ కూడా ఓ అయిదు పది నిమిషాలు మాత్రమే. వెంటనే తనకు తాను నచ్చజెప్పుకుని సెట్‌రైట్ అయిపోయాడు రెడ్డి... మనసులోపల మహా నదులు పోటెత్తుతున్నా పైకి తొణక్కుండా ఉండడాన్ని రాజకీయాల్లోకి వచ్చాకే నేర్చుకున్నాడతను. లోపలి భావాలేవీ ప్రతిబింబించనీకుండా మొహం కడుక్కుని చిరునవ్వుతో బయటికొచ్చాడతడు చివరికి.

హాల్లోనూ, వరండాలోనూ, కాంపౌండ్‌లో మల్లగుల్లాలు పడుతున్న జనాలంతా అన్న రాకతో మౌనం వహించారు... అసలేమీ జరగనట్లుగానే వచ్చి సోఫాలో కూర్చొని మాటలుకలిపాడు రెడ్డి... అందరికీ భోజనాలు ఏర్పాటు చేయమని రాజేశ్వరికి పురమాయించాడు.

"అన్నా మధ్యాహ్నం మూడుగంటలా ముప్పై అయిదు నిమిషాలకు బాగుండాదంటన్నా నామినేషనేయడానికి. పద్మయ్యస్వామి చెప్పంపిచ్చాడు," చెప్పాడు హరిబాబు.

అప్పటికి రెండోసారి వంట ప్రయత్నాలు కొనసాగిస్తోన్న రాజేశ్వరి గుండె వేగంగా కొట్టు కుంది భర్త నిర్ణయం కోసం.

క్షణకాలపు మౌనం తర్వాత

"అలాగే వేద్దాం," తలూపాడు చంద్రారెడ్డి హుందాగా.

బావమరిది విజయకుమార్ రెడ్డి చెప్పాచెయ్యకుండా నామినేషనేయడంతో చంద్రారెడ్డి నిలబడతాడో, లేదోనని మధన పడుతోన్న చంద్రారెడ్డి మనుషులంతా హర్షాతిరేకంతో కేరింతలు కొట్టారు.

"అయినా ఈ బజారులో నా కొడుకులంతా కలిసి ఎక్కబెట్టేశారులేన్నా. లేకుంటే విజయన్న అంత ధైర్యం చెయ్యడు" విజయకుమార్‌రెడ్డిని సమర్ధిస్తూ చంద్రారెడ్డిని ఓదార్చడానికి ప్రయత్నించాడు సిద్ధయ్య.

"ఆ... అవును పాపం నోట్లో ఏలుపెడితే కొరకలేడు. కుర్రనాకొడుకులు చెబితే మాత్రం ముందూ, ఎనకా చూడాల్నా పళ్లేదా? పది రూపాలు సంపాయిచ్చుకుని ప్రశాంతంగా బతకతుండాడు గదా అనుకుంటే రాజకీయాల్లోకి లాగిపారేసినారు. ఈ కాలం ఎక్కడ బట్టినా ఇదే దరువు. నాలుగురాళ్లు ఎనకేస్తే చాలు. రాజకీయాల్లోకి దిగాలనుకుంటుండారు."

చంద్రారెడ్డికి ఒక్కక్షణం పిల్లకాకితో పోటీపడ్డం ఇబ్బందిగా అనిపించినా, ఉండేలు దెబ్బని రుచి చూపించాలనుకున్నాడు.

ఇన్నేళ్లుగా తననీ, తన రాజకీయాన్నీ నమ్ముకుని ఈ ఇంటినే అంటి పెట్టుకుని జీవిస్తున్న తన మనుషులంతా దిక్కులేని పక్షుల్లా కకావికలైపోవడాన్ని అతడు ఊహించలేకపోతున్నాడు. అందుకే ఈ నిర్ణయం. బుజ్జి

శెట్టి చెప్పినట్లు ఏనుగు బతికినా చచ్చినా వెయ్యి రూపాయలే.

చంద్రారెడ్డి నిర్ణయంతో-

"చంద్రారెడ్డికీ జై... చంద్రన్నకీ జై," అన్న కేకలతో ఆ కాంపౌండ్ అంతా మార్మోగిపోయింది.

ప్రమేయం లేకుండానే చంద్రారెడ్డి గుండెలు ప్పొంగాయి... ఆనందమూ, దిగులూ కలగలిపిన భావ మేదో రాజేశ్వరి మనసుని కదిలించింది.

*

"అన్నా! విజయుడు మరీ దూకుడు మీదుండా డన్నా, నామినేషన్ రోజే యాభైవేలు ఖర్చు పెట్టేశాడు. అది జనం కాదనుకో. రోడ్లు పట్టలేదు," చెప్పాడు హరిబాబు.

"అవునవును. మనిషికో సారాయి ప్యాకెట్టు, సాయంత్రానికో వందనోటు... రాక చస్తారా జనం..." ఎద్దేవా చేశాడు నారాయణ.

"అసలు భలే స్పీడుమీదుండాడులే నారాయణా. డబ్బు చిల్లపెంకుల మాదిరి చల్లి పారేస్తుండాడు. అప్పుడే కాలనీలన్నీ చుట్టేసొచ్చినాడు. చాకలి కాలనీలో గుడి కట్టిస్తానని ప్రమాణం చేసినాడు. మాలాయ కోటలో మసీదుకి రాళ్లు తోలించేసినాడు. బీడీ కాలనీలో ఖబరస్తాన్‌కి డబ్బులిచ్చేసినాడంట. రాజీవ్‌గాంధీ కాలనీలో రామమందిరం కట్టిస్తానన్నాడంట.

"ఆ కాలనీల్లో విజయుడంటే ఎవరికీ తెలవదు కాబట్టి చుట్టేసొచ్చినాడు. చంద్రన్న పదిహేనేళ్ల నుండీ తిరగతానే వుండాడు కదా కాలనీల్లో... కాలనీ జనాలకి చంద్రన్నేమైనా కొత్తా."

బొయ్‌మంటూ వరస కార్ల శబ్దంతో ఎం.ఎల్.ఏ వచ్చినట్లు అర్థమైందందరికీ. తాగుతోన్న కాఫీగ్లాసు పక్కనబెట్టి మెల్లగా లేచి గుమ్మంవైపుగా రెండడుగులు వేశాడు చంద్రారెడ్డి.

మంత్రిపదవి పోయినా సెక్యూరిటీని వదలక పోవడంతో బూట్ల శబ్దాలు ధనధనమంటూ ఎం.ఎల్.ఏ. కంటే ముందే లోపలికొచ్చేశాయి. గంజిపెట్టిన ఖద్దరు బట్టలతోపాటుగా మణెయ్య లోపలి కడుగుపెట్టాడు.

అప్పటికే కాఫీలు తాగుతూ చంద్రారెడ్డితో మంత నాలాడుతుండిన రామిరెడ్డి, బుజ్జిశెట్టి వగైరాలంతా మర్యాదపూర్వకంగా లేచి నిల్చుని మళ్లీ ఎం.ఎల్.ఏ.తో పాటుగా కూర్చున్నారు.

చంద్రారెడ్డితో ఏకాంతంగా మాట్లాడాలని వచ్చిన ఎం.ఎల్.ఏకి ఆసరికే అక్కడ వీళ్లంతా ఉండడంతో ఒక నల్లనినీడ అతని ముఖంమీద తారాడి కదిలిపోయింది. అందరికవంక చూసి నవ్వుతూనే చంద్రారెడ్డి భుజం మీద చెయ్యివేసి మెల్లిగా లోపలికి నడిపించాడు ఎం.ఎల్.ఏ...

లోపల డైనింగ్ టేబిల్ మీద అందరికీ టిఫిన్లు రెడీ చేస్తోన్న రాజేశ్వరి మణెయ్యని చూడగానే చేతులు జోడించి చిరునవ్వు నవ్వింది... డావిన్సీ చిత్రించిన చిత్రపునవ్వులా అందులో భావాల్ని పసిగట్టడం కష్ట మైంది ఎం.ఎల్.ఏకి. తనూ అర్థంలేని నవ్వొకటి విసురుతూ కుర్చీ లాక్కున్నాడు, "బావున్నారా అమ్మా," అంటూ.

ఈ ఎం.ఎల్.ఏ రాజకీయాల్లోకి రాకముందు నుండీ తన భర్తా, మామగారూ పార్టీలో ఉన్నారు. రామా రావు తెలుగుదేశం పెట్టినప్పుడే మామగారు పార్టీలో చేరిపోయారు. అప్పటినుండీ ఇప్పటి వరకూ తండ్రీ కొడుకులిద్దరూ ఊరి రాజకీయాల్లో భాగమైపోయారు. ఊరి ప్రజలకు తల్లో నాలుకైపోయారు. ఈ ఎం.ఎల్.ఏకి రాజకీయాలు నేర్పించి టిక్కెట్టిప్పించింది మామగారు. నియోజక వర్గంలోని ప్రతి ఊరికీ తిప్పి, కార్యకర్తల్ని పరిచయం చేసి గెలిపించింది మామగారు. తొలిఛాన్సు లోనే మంత్రి పదవి రావడానికి కారణం కూడా మామ గారేనని అంతా చెప్పుకుంటారు. అటువంటిది నిన్నగాక మొన్న కాంగ్రెస్‌లో నుండి అధికారపార్టీలోకి ఎగిరి దూకిన మాల్యాద్రినాయుడు ఎక్కువై పోయాడిప్పుడీ ఎం.ఎల్.ఏకి.

అవును మాల్యాద్రి దగ్గరైతే డబ్బులుండాయి కట్టలు కట్టలుగా... మన దగ్గరేముండాది? ఉణ్ణిం దంతా ఊడ్చి ఎలక్షన్లకీ, పోలీస్టేషన్లకీ... మిగిలితే పేదోళ్లకీ పెట్టనే సరిపోయె... దీర్ఘంగా నిట్టూర్చింది రాజేశ్వరి.

అటు తమ్ముడికీ, ఇటు భర్తకీ జరగబోయే యుద్ధం ఆమెని కుంగదీస్తోంది... నాయకులు యుద్ధం కోరుకుంటే ప్రజలు శాంతి కావాలనుకుంటారు అంటారు కదా! మరేమిటో ఇప్పుడు నాయకులూ, జనాలూ కూడా యుద్ధాన్నే కోరుకుంటున్నారు. ప్చ్... ఇన్నేళ్లుగా రాజకీయం చేసిన తన భర్త బామ్మర్దికి భయ పడి విత్‌డ్రా చేయడమన్నది మింగుడు పడడంలేదా మెకి... ఇదిలాఉంటే పార్టీని రెండుగా చీల్చేసి మాల్యాద్రి నాయుడిని వేదిక మీదికి తెచ్చేశాడీ ఎం.ఎల్.ఏ.

ఛీ... ఛీ... ఈ ఎం.ఎల్.ఏ వచ్చిన తర్వాతనే ఈ ఊరి రాజకీయమంతా ఇట్టయిపోయింది. పార్టీలో

ఒకటిగా ఉన్న మనుషులందరినీ విడివిడిగా వేరు చేసేసినాడు. గ్రామాల్లో కార్యకర్తల మధ్య ఉండే మిత్ర వైరుధ్యాల్ని శత్రువైరుధ్యాలుగా మార్చేశాడు. ఇంతకు ముందంతా ఎన్నికలు, గెలుపోటములు, మనస్పర్ధలు ఊరికే పరిమితమై ఉండేవి. ఇప్పుడ్కిడ నాయకుల ఆధిపత్యం జిల్లాకు విస్తరించింది. ఇంకా అవసరమైతే రాష్ట్రస్థాయిలో కేంద్రీకృతమౌతుంది.

వంటగదిలోకి, డైనింగ్ టేబిల్ దగ్గరకి షటిల్ ఆడుతోన్న రాజేశ్వరి భర్తకీ, ఎం.ఎల్.ఏకి మధ్య జరుగు తున్న సంభాషణ వింటూనే ఆలోచిస్తోంది.

"నేను చెప్పేది అర్ధం చేసుకోండనా... పరిస్థితి బాగులేదు. మీరసలు జిల్లా నాయకులు. పంచాయితీ కేందన్నా మీరేసేది... నా మాటినండి," భర్తని ఐస్ చేస్తు న్నాడు ఎం.ఎల్.ఏ. "ఖర్చు కూడా అయ్యేట్టుందన్నా. ఇప్పుడు మీరుండే పరిస్థితుల్లో ఇది విత్‌డ్రా చేసు కోడమే మంచిది."

చంద్రారెడ్డి మౌనంగా మణెయ్యకేసి చూస్తు న్నాడు సాలోచనగా. ఒకప్పుడు ఎం.ఎల్.ఏ కాకముందు తన తండ్రి ఎదురుగా చేతులు కట్టుకుని నిల్చునుండే మణెయ్య రూపం పదేపదే జ్ఞప్తికొచ్చిందతడికి.

'ఖర్చౌతుందట ఖర్చు' మనసులోనే కసిగా అను కుంది రాజేశ్వరి. ఇతడి శాసనసభ ఎన్నికల కోసం భర్త, మామగారు ఎంత శ్రమపడిందీ, ఎంత ఖర్చు చేసిందీ అప్పుడే మర్చిపోయాడేమో... అంత అభిమానమున్న వాడైతే ఒక రెండు లక్షలివ్వొచ్చుగదా... మణెయ్య చేతికి కాఫీ అందిస్తూ మథనపడింది రాజేశ్వరి.

"ఖర్చు లేకుండా ఏముండాదిలే మణెయ్యా," అప్పుడే లోపలికొచ్చిన రామిరెడ్డి అందుకున్నాడు. "ఎలక్షన్లలో ప్రజాస్వామ్యమేడుంది? ఇప్పుడు సర్పంచి సీట్లు గూడా ఇంత లెక్కన యాలమేసి అమ్మేస్తుంట్రి. ఈ పక్క అత్తలపాళెం, రోసనూరు పంచాయితీలంతే కదా! లక్షా, లక్షా యాభైవేలకి బేరం కుదిరిపోయాయి. అంతంత చిన్నూర్లలోనే అట్టుంటే, ఈ మేజర్ పంచా యితీ సంగతి చెప్పాలా? డబ్బులేకుండా ఏది జరగతాది చెప్పు."

రాఘవరెడ్డి, చంద్రారెడ్డిల ప్రాపకంతో ఎం.ఎల్.ఏ అయ్యి కోట్లు సంపాదించుకొని ఇప్పుడు అన్నని నిర్లక్ష్యం చేస్తోన్న మణెయ్య అంటే చంద్రారెడ్డి మనుషులందరికీ ఒళ్లుమంటే.

"ఒక పంచాయితీ అనేముండాది? మొత్తం రాజ కీయమే అట్టుండాది. ప్రజల్యాడ ఎన్నుకుంటా వుండారు నాయకుల్ని. డబ్బు కదా ఎన్నుకునేది. ఎన్ని లక్షలు ఖర్చు పెట్టగలిగితే, వాడేకదా నాయకుడు. డబ్బుంటే చాలు బోరవిరుచుకుని రాజకీయాల్లోకి దిగొచ్చు. అసలు నాకు తెలవకడగతాను గాన్యా ఎలక్షన్లు దేనికినా?... జనాల కోసమా? పోటీ చేసేవాళ్ల కోసమా? పేదోళ్లకి తిండి, గుడ్డ, నీడ కల్పించేదాని కోసమా? లేకపోతే పెద్దోళ్లు పదవులు పంచుకునే దానికా? అహ... ఎందుకనీ?..." చంద్రారెడ్డి చిన్నాయన కొడుకు మురళీరెడ్డి అడిగినదానికి సమాధానం చెప్పలేక 'అహ...హ్హ' అంటూ నవ్వి తేల్చేశాడు ఎం.ఎల్.ఏ. అందరూ ఇలా తలోపక్క నుండీ తగులుకుంటారని అతను ఊహించ లేదు...

బయటున్నవాళ్లంతా ఒక్కొక్కరే మెల్లిగా లోపలికి చేరుతుండడంతో చప్పున లేచి చంద్రారెడ్డి దగ్గరగా వంగి "అన్నా ట్రయాంగిల్ ఫైట్ కష్టమౌతాదన్నా... ఇటు మీ కుటుంబంలోనూ, అటు పార్టీలోనూ చీలిక... రెండు విధాలుగా దెబ్బే... ఆలోచించుకోండి..." మెల్లిగా చెప్పి "సరే నేను రాత్రికొస్తానన్నా," అంటూ చేయందించి అందరినీ విష్ చేసి సరసరా వెళ్లిపోయాడు మణెయ్య. అప్పటికి ఖద్దరు బట్టల గరగర కొంత తగ్గింది.

"అవును... పార్టీలో చీలిక... ఎవరివల్ల వచ్చింది దంతా? వీడివల్లగాదూ... ఏం ఆ మాల్యాద్రినాయుడికే చెప్పి విత్‌డ్రా చేయించొచ్చుగదా? చంద్రన్న ఎందుకు చేయాలి?" వంటి ఎన్నో ప్రశ్నలు చంద్రారెడ్డి మనుషుల్ని తొలిచేస్తున్నాయి.

చంద్రారెడ్డి పైకి అచేతనంగా ఉన్నట్టున్నాడుగానీ లోపల తన బలాన్నీ, మాల్యాద్రినాయుడు బలగాన్నీ, ఇటు విజయుడి డబ్బునీ, తులాల కింద బేరీజు వేస్తు న్నాడు.

*

"విలేఖరి రాజేంద్ర కూడా విజయుడివైపే తిరుగు తున్నాడంట గదా," భర్తకి మంచినీళ్ల గ్లాసు అందిస్తూ కదిపింది రాజేశ్వరి. మధ్యాహ్నం వదిన ఫోన్ చేసి ఎగ తాళిగా ఈ విషయం చెప్పినప్పటి నుండి కాళ్లూ చేతులూ ఆడ్డం లేదామెకి. రాజేంద్ర 'అక్కా అక్కా' అంటూ ఇంట్లో మనిషిలా తన వెనుకే తిరుగుతుండే వాడు. వాడి భార్య కిరోసిన్ పోసి తగలబెట్టుకున్నప్పుడు కేసు లేకుండా చేయడం కోసం భర్త యస్.పి. చుట్టూ సొంత ఖర్చులతో తిరగడం ఇంకా గుర్తుంది.

అప్పుడే ప్రచారాన్నుండి వచ్చిన చంద్రారెడ్డి నిర్భా వంగా భార్యకేసి చూశాడు. అసలే మే నెల ఎండ బారిన

పడి వడలిపోయిన మొహం మరింత నల్లబారిపో యింది. నలిగిపోయిన ఖద్దరు చొక్కా అతడి స్థితినీ, అలసటనీ ప్రతిబింబిస్తోంది.

ప్రచారంలో మల్లికార్జునరెడ్డి, గోపాలరెడ్డి కొడుకూ, ఇందిరమ్మ టీచరు భర్త అంతా విజయుడి కోసం ఓట్లు దగడం చూసి ఆశ్చర్యపోయాడు. ఇంటికి రాగానే భార్య రాజేంద్ర గురించి చెప్తోంది. వీళ్లంతా తన నుండి ఎంతెంత సాయం పొందారు. డబ్బునీ, సమ యాన్నీ కూడా లెక్క చేయకుండా, వాళ్లది న్యాయమా కాదా అని కూడా ఆలోచించకుండా వాళ్ల తరపున ఎంతెంత పోరాడాడు తను. అటువంటిది వాళ్లంతా ఇప్పుడు విజయుడి చుట్టూ తిరగడానికి కారణ మేమిటి? ఛా... ఛా... డబ్బు మరీ ఇంత నీచంగా పని చేస్తుందా? అవునవును ఇప్పుడు రాజకీయాల్లో అదేగదా ముఖ్యంగా పనిచేసేది...

ఒక్క పదవితో లక్షలు దోచేయాలనుకుంటారు నాయకులు. ఒక్క ఎలక్షన్‌తో పైకొచ్చేయాలనుకుం టారు కార్యకర్తలు. ఆ ఒకటి, రెండురోజులైనా కడుపు నిండా తిండి తినాలనుకుంటాడు పేద ఓటరు. అందుకే నాయకులు, ప్రజలు అంతా యుద్ధాన్నే కోరుకుంటు న్నారు.

"అన్నా, ఓటుకు వంద రూపాయల్లెక్కన పంచు తుండాడంటన్నా విజయుడు," హడావుడిగా పరుగెత్తు కొచ్చాడు నారాయణ.

వంద రూపాయలా?... అదిరిపడ్డాడు చంద్రా రెడ్డి... ఈ పంచాయితీ చరిత్రలో ఇప్పటికి లేదు ఓటుకి వంద రూపాయలివ్వడం. ఏదో ఓటుకి ముప్పై, నలభై ఇచ్చేవాళ్లు. ఎంత బ్రాందీ షాపుంటే మాత్రం సాయంత్ర మయ్యేసరికి ప్రతి కాలనీలో కేసులు కేసులుగా దింపే స్తుండాడంట. ఎందుకని విజయుడిట్లా పరుగుమీదుం డాడు? అటు మాల్యాద్రి కూడా ఇలాగే మంచినీళ్లలా ఖర్చు పెడుతున్నాడు. వాళ్లిద్దరితో పరుగు సాధ్యపడే విషయమేనా? ఇట్టయితే ఇంకా రెండు మూడు లక్షలు చూసుకోవలసి వస్తుంది తను.

కార్యకర్తలు డీలాపడ్డం బాధగా ఉంది చంద్రా రెడ్డికి. అనుకున్న డబ్బు చేతికందకపోవడంతో పరిస్థి తంతా అయోమయంగా ఉంది. ఓట్లకి పంచడానికీ, మందుకీ డబ్బు వెదుక్కోవాలి.

నిజంగానే విజయుడు గెలుస్తాడా? తన దగ్గ రుంటూ పరిచయాల్నీ, ప్రాబల్యాన్నీ, తన పలుకుబడితో డబ్బునీ పెంచుకున్న విజయుడు, ఈరోజు ఆ డబ్బు తోనే తన మనుషులందర్నీ ఒక్కొక్కర్నీ కొనేస్తున్నాడు.

ఇప్పుడు రాజకీయాల్లో ఎవరికీ సిద్ధాంతం లేదు. ఆధిపత్య రాజకీయాలూ, డబ్బూ, కులమూ, కక్ష సాధిం పులూ ఇవే రాజకీయంగా పరిణమించాయి. ముఖ్యం గా ఈ మండలాల ఎన్నికలొచ్చాక ఊరే చాలా మారిపో యింది. ఒక్క మాట మీద కట్టుగా ఉండడమన్న పద్ధతే లేకుండాపోయింది. వీధివీధికీ నాయకులైపోయారు.

ముళ్లకంచె మీద అతుక్కుపోయిన పాతపంచె లాగా ఉంది చంద్రారెడ్డి మనసు. బలహీనపడుతున్న ట్లుగా కూడా ఉంది... ఇన్నేళ్లుగా తన చేతి కింద ఇంత మందిని పెట్టుకుని ఊరినే శాసించినవాడికి ఈ జంకేంది? భయమేంది?... నిత్యం వచ్చిపోయే జనా లతో నిండుగా ఉండే ఇల్లు, ఎన్నో ఏళ్లుగా మంచికీ చెడుకీ ఆలవాలమైన ఇల్లు మనిషి జాడ లేకుండా పోతుందా? స్మశానం కళ్ల ముందు నిలిచింది రెడ్డికి...

ఆలోచనలు ఒక కొలిక్కి రావడంలేదు.

అసలు ఓటుకి డబ్బివ్వడమనే ఆచారం ఎప్పుడు ఎక్కడ మొదలైంది. తనకి గుర్తున్నంత వరకూ తన తండ్రి హయాంలో ఏనాడూ ఓటుకి డబ్బిచ్చిన జ్ఞాపకం లేదు. చివరి సమితి ఎలక్షన్లప్పుడు మాల్యాద్రినాయుడి మేనమామ క్రిష్ణమూర్తినాయుడు ఓటుకి ఇరవై లెక్కన డబ్బిచ్చి కొన్నాడని అంటారు. పోలింగు రోజు ఓటేయ డానికొస్తే పనికి పోవడానికుండదనీ, కూలీడబ్బులు రావనీ చాలామంది జనం పోలింగుకి వచ్చేవాళ్లు కాదు. అందుకని ఆరోజుకి కూలీడబ్బులు మేమిస్తాం, వచ్చి ఓటేయండని వాళ్లని బతిమాలి, బామాలి పోలింగుకి తీసుకొచ్చేవాళ్లు అభ్యర్థులు. అలా మొదలైన ఈ సాంప్ర దాయం క్రమంగా ఓటుకి డబ్బివ్వడంగా మారిపో యుండొచ్చు. ఇప్పుడీ మొత్తం క్రమమంతా మళ్లీ వెనక్కెలా తిరిగొస్తుంది?

"అయినా ఈసారి ఎలక్షన్లు పంచాయితీ ఎలక్షన్ల మాదిరిగా లేవు... ఎం.ఎల్.ఏ ఎలక్షన్ల మాదిరుం డాయి..." భర్త చేతి నుండి గ్లాసందుకుంటూ తనలో తాను గొణుక్కుంది రాజేశ్వరి. మళ్లీ పెద్దగా అనడాని కామెకి ధైర్యం చాలలేదు. భర్త తననీ, తన పుట్టింటినీ, విజయుడ్నీ అందరినీ తూర్పారపడతాడేమోనని సంకో చించింది.

*

"కాలనీల్లో పండగమాదిరుందన్నా, విజయుడు చీరలు తెచ్చి పంచతుండాడు. మాల్యాద్రి కుర్చీలు చిన్నవి తెచ్చి ఇస్తుండాడు ఇంటింటికీ. ఆయన గుర్తు కుర్చీ కదా అందుకని. ఒక పంచాయితీకి వాళ్లు

ఇంతింత ఖర్చు పెట్టి గెలవాలనుకుంటుండారంటే వాళ్లు దాంట్లోంచి ఎంత తినెయ్యాలనుకుంటుండారో అర్థం చేసుకోమని కాలనీ జనాలకంతా విడమర్చి చెప్పొచ్చినానన్నా,'' చెప్పాడు సిద్ధయ్య.

''జనాలకి అంత దూరం ఆలోచనుంటాదా సిద్ధయ్యా... ఈరోజు వచ్చే డబ్బులే కదా వాళ్లకి. అందులో ఈ నడమ వానల్లేక, పనుల్లేక దాహానికల్లాడి పోతుండారు జనం... వాళ్లు వద్దనలేనంత డబ్బులొస్తుంటే ఎట్టా కాదనగలరు చెప్పు?''.... ఇందులో లేబర్ తప్పేమీ లేదన్నట్టుగా అన్నాడు చంద్రారెడ్డి. కూడుకు పోయిన రొయ్యల డబ్బు, సారాయి డబ్బు ఏదో ఒక మార్గంలో పేద ప్రజలకి చేరడమే న్యాయమన్నట్టుంది అతడి ధోరణి.

ఊళ్లో ఎక్కడచూసినా ఇవే మాటలూ, ఇవే ఆలోచనలూ, టీలు తాగుతూ బీడీలు, సిగరెట్లు కాలుస్తూ ప్రతి సెంటర్లోనూ ఇవే చర్చలు... ఊరంతా ఎన్నికల వాతావరణంతో గుబగుబ లాడిపోతోంది.

కొంతమంది ఆటో వస్తాదంటే, మరి కొంతమంది ఒకటిరెండు ఓట్లతోనైనా క్యారమ్‌బోర్డు గెలుస్తాదని పందేలు కట్టుకుంటుండారు. కుర్చీ మాత్రం మూడో స్థానంలో ఉంది. ఎం.ఎల్.ఏ కూడా కుర్చీలోనే ఊరేగుతుండాడు. అయినా కుర్చీ మూడోస్థానంలో ఉందని అందరూ ఎద్దేవాగా చెప్పుకుంటుండారు.

''త్పూ.... వాడూ ఒక మనిషా?... అన్న పలుకుబడితో, అన్న డబ్బుతో గెలిచి కులకతుండాడు... ఈరోజు అన్న పంచాయితీకి నిలబడితే సపోర్టు చేయాల్సింది పోయి, మాల్యాద్రి నాయుడితో తిరగతుండాడు... పార్టీని ఇట్టా చీల్చి చితుకులు చేస్తున్నాడని ముఖ్యమంత్రికి రిపోర్టియ్యాల... ఇంటికి పోతాడెదవ,'' కాల్తో నేలని తన్ని ఆవేశంగా బయటికెళ్లిపోయాడు సిద్ధయ్య.

సిద్ధయ్యకి టీచరు పోస్టింగిప్పించింది పెద్దాయన రాఘవరెడ్డి... అయితే మొదటి నుండీ రాఘవరెడ్డి వద్ద, చంద్రారెడ్డి వద్దా సాయం పొందిన వాళ్లంతా వచ్చి స్వచ్ఛందంగా ఓట్లేస్తే, ఈరోజు చంద్రారెడ్డి డబ్బుకోసం వెతుక్కోవలసిన అవసరమే ఉండేదికాదు...

పున్నమి చంద్రుని రాకతో హఠాత్తుగా చల్లబడిన ఆ వేసవి సాయంత్రం తగిన అభ్యర్థికి ఓట్లేయమని ఆ ఊరి ప్రజల్ని అడుగుతున్నట్లుగా ఉంది.

*

చాకలి తెచ్చిన చంద్రారెడ్డి బట్టలు బీరువాలో సర్దుతున్న రాజేశ్వరి ఉలికిపడింది... బయటేదో రచ్చ జరుగుతోంది. కొట్లాటలైన చప్పుడు... ఎంతోమంది జనాలు అటూఇటూ దబదబా పరుగెడుతోన్న శబ్దాలు... చేస్తున్న పనినాపి గుమ్మంవైపుగా నడిచిందామె.

అప్పటికే గసపోసుకుంటూ పరుగెత్తుకొచ్చిన శంకరయ్య ''అక్కా మన డాక్టర్ని ఆ నాయుడి మనుషులు కొట్టేసినారక్కా. మాంచి దెబ్బలు... నెల్లూరు ఆసుపత్రికి తీసుకపోతుండారు... మనోళ్లింకా ఎంతమందికి దెబ్బలు తగిలినాయో తెలియడంలేదు,'' భయం భయంగా చెప్పాడు.

''ఎల్లుండి ఎలక్షన్లు జరగనీరంటక్కా... రిగ్గింగ్ చేసైనా గెలుస్తానని వీడూ... శవాలు లేపైనా గెలిచి తీరతానని వాడూ అంటుండారు,'' అపోజిషన్ అభ్యర్థులిద్దరినీ ఉద్దేశించి బూతులు తిట్టసాగాడు రొప్పుతూనే... ఇదంతా వినీవినకుండానే అత్త శోకాలు తీస్తూ శపిస్తోంది.

''మూడు దినాలకొకసారి ఈ ఎలక్షన్లు మాకోసమే వస్తా వుండాయి... అయిపుట్ల వడ్లన్నీ అమ్మి అమ్మి దీనికి బెట్టను సరిపోయె... యాపారంలో వచ్చేదంతా చాలకపోయె... ఇంత డబ్బు పెట్టిగూడా ఎప్పుడేమోనే... ఏం జరగతాదోనే అని వణికి సచ్చేట్టుగా ఉండాది. ఆ డాక్టరు ఆ పక్కనెందుకొస్తున్యాడో వంటిగా... ఆ సచ్చి నోళ్లకిదేం పోయేకాలమో... ఎందుక్కొట్టినారంటమ్మా?

''అయ్యో అప్పుడంతా ఎలక్షన్లంటే ఇట్టాయుణ్ణింది తల్లా... ఏందో పొయ్యి దేని మీదెయ్యమంటే దానిమీద గుద్దేసొచ్చేవాళ్లం... ఇప్పుడు ఓటేయను పోవాలంటే కూడా భయంగా ఉంది... ఇట్టంతా అయితే పెద్దాయనెట్ట చేసుణ్ణు రాజకీయం. ఎంతెంతమందికి ఈ చేతుల్తో వండి పెట్టుంటాను... దినానికి ఎన్ని టీలు, కాఫీలు పెట్టుంటాను... ఈ కంటితో ఎన్ని ఎలక్షన్లు చూసుంటాను, ఇట్టంతా ఎప్పుడూ లేదు తల్లా... ఈయ్యన్నీ చూసేదానికంటే యామైనా మింగి సచ్చేది మేలుగా వుండాది.''

అత్త పెడుతోన్న శోకాలు రాజేశ్వరి గుండెల్లోకి దిగుతున్నాయి. దిగులుతోను, భర్తకి ఏ ఆపద రానున్నదోననే భయంతోనూ, జీవితం ఏం కానున్నదోన్న మథనతోనూ ఆమె వణికిపోతోంది.

నిజమే, తన చిన్నప్పుడు ఎన్నికలంటే ఇంత ఆవేశకావేషాలుండేవి కావు... ఎవరి ఓటు వాళ్లు ప్రశాంతంగా వెళ్లి వేసొచ్చేవాళ్లు... దాదాపు సాయంత్రందాకా పోలింగు జరుగుతూనే ఉండేది... అంటే బహుశా తొంభై శాతం పోలింగు కావచ్చు. అయినా ఒక్క దొంగోటు కానీ, రిగ్గింగు కానీ, గొడవలు కానీ జరిగేవి కావు.

ఇప్పుడేమిటో డబ్బు, మందు, దొంగోట్లు, కాదంటే గొడవలూ, వీటితోనే రాజకీయాలు నిండి పోయాయి.

డబ్బు చేతికందక భర్త పడుతోన్న మధన ఆమె గమనిస్తూనే ఉంది... సాయంత్రమైతే అన్ని కాలనీల వాళ్లూ వచ్చేసి డబ్బుకోసం భర్తని జలగల్లా పీక్కుతినడం చూస్తోంది... విజయుడు డబ్బు మంచినీళ్లలా ఖర్చు పెట్టడాన్ని గురించి వైనవైనాలుగా వింటోంది. పుట్టింటి తరపువారు ఫోన్లు చేసి ఎగతాళిగా మాట్లాడుతూంటే తట్టుకోలేకపోతోంది... ఎన్నో ఏళ్లుగా భర్తని కనిపెట్టు కొని ఉన్న పెద్దమనుషులంతా ఒక్కొక్కరుగా జారిపోవ డాన్ని తెలుసుకుని బాధపడుతోంది... భర్తని చూస్తుంటే ఆమెకి జాలిగా ఉంది. రాత్రి పగలూ నిద్రలేక, వేళకి తిండిలేక, ఎండనిబడి ఇల్లిల్లూ తిరిగి డీలాపడి పోయాడు. ఆరోగ్యం పాడైపోయింది. ఈ పాడు రాజ కీయం కోసం ఆరోగ్యాన్నీ, జీవితాన్నీ కూడా పణంగా పెట్టాడతడు.

మొత్తం జీవితాన్నీ, భర్త పరిస్థితినీ బేరీజు వేసు కుంటూ మధనపడుతూ అతడికోసం ఎదురుచూస్తోంది రాజేశ్వరి. పెళ్లైన్నాటి నుండీ కూడా భర్త నుండి ఎనలేని ప్రేమాభిమానాలను పొందలేకపోయినా, అతడ్ని తను నిజాయితీగానే ప్రేమించింది... ఎన్నెన్నో స్పర్శల్ని కోల్పోయి జీవితమంతా ఒక అలవాటుగా బ్రతికేస్తూ వచ్చిన రాజేశ్వరికి ఇప్పుడీ సన్నివేశంలో అనుభవ సాంద్రత మరింత తీవ్రంగా ఉంది.

ఇప్పటి భర్త పరిస్థితి ఆమెని మరింత బాధి స్తోంది... ఎప్పుడూ ఓటమిని చవిచూడనివాడు ఈసారి ఎన్నికల్లో ఏదైనా అయితే... అందునా తన బావమరిది చేతుల్లో ఓడిపోతే ఆయన తట్టుకోగలడా? పుట్టింటివైపు జనాలంతా తమని చిన్నచూపు చూస్తారా? నిజంగా ఇటువంటి ఒక పరిస్థితిని తను భరించగలదా?

డబ్బు పంపకం, ఎడతెగని మందు సరఫరా, ఆడవాళ్లకి చీరల పంపిణీ... ఇటువంటి అపమార్గాలతో అవతలి ఇద్దరు అభ్యర్థులూ పరుగులు తీస్తుంటిరి... ఈ పరుగు తన భర్త అందుకోగలడా? అందుకోకపోతే ఏమౌతుంది? ఈ రాత్రికి రాత్రి ఏ అద్భుతం జరుగు తుంది?

భర్త పరువు కోసం, కుటుంబగౌరవం కోసం ఇలా ఆలోచిస్తోంది కానీ నిజానికి రాజేశ్వరికి రాజకీయాల పట్ల ఎనలేని ఏవగింపు.

తన భర్త ఏరోజూ కుటుంబ విషయాలు పట్టించు కున్నోడు కాదు... అయినా సంతోషంగా అవన్నీ తన బాధ్యతలుగా స్వీకరించింది... తను ఆరోగ్యం బాగలేక పడుకుంటే 'ఏమైందని' అడగడు... అయినా సర్దు కుంది... నెలల తరబడి భార్యగా కూడా దగ్గరికి తీసు కోడు... అయినా ఓర్చుకుంది. పిల్లల్నెక్కడో దూరంగా నెల్లూరు హాస్టల్లో ఉంచాడు... సర్లెమ్మనుకుంది... వ్యాపారం సరిగా పట్టించుకోక గుమాస్తాల పాలవు తోంది... నానాటికీ కుటుంబం దిగజారిపోతోంది.

ఎప్పుడూ జనం...జనం...జనం... వాళ్ల అవ సరాలూ, వాళ్ల ఇబ్బందులూ, వాళ్ల మంచి చెడ్డలూ... ఇదే జీవితం. మంచిదే నిస్వార్థంగా జనాలకోసం పాటు పడడం, కాదని ఎవరంటారు? అయితే ఇటువంటి వాళ్లకి సంసారాలూ, భవబంధాలూ ఉండకూడదు... ఇటువంటివాళ్లు మాంచి నాయకులైతే అయిఉండొచ్చు గానీ, మంచి భర్తలు కాలేరు... మంచి తండ్రులు కాలేరు...

పరస్పర విరుద్ధమైన ముళ్లేవో ఒకదాన్నొకటి ఎదు ర్కొంటున్నట్లుగా ఉన్నాయి... ద్వైదీభావంతో ఆమె మనసు కొట్టుమిట్టాడుతోంది.

*

పోలింగ్‌కి అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. ఊరంతా ఊపిరాడనంత ఉత్కంఠతతో ఉంది... ఆ రాత్రి కుర్చీవాళ్లూ, ఆటోవాళ్లూ ఇద్దరూ కూడా అను మానంతోనూ, గెల్చి తీరాలన్న ఆసక్తితోనూ రెండో విడత నోట్లు పంచారు ఓట్లకి... ఊరంతా మూలమూల కాలనీల్లో డబ్బు విలయతాండవం చేస్తోంది. చంద్రారెడ్డి మనుషులు కూడా కొంత డబ్బూ, మందూ పంచినా అవతలి వాళ్లతో పోలిస్తే అది చాలా తక్కువ.

ఆ రాత్రి గడిచి పోలింగ్ రోజు వచ్చింది.

చంద్రుడెందుకో వెళ్లలేక వెళ్లలేక దిగులుగా మబ్బులచాటుకెళుతున్నాడు. పొద్దు పొడవడానికి కిష్టం లేనట్టుగా గునుస్తోంది... ఆ తెల్లవారుఝామున చంద్రా రెడ్డి ఇంట్లో పెద్దపెట్టున ఏడుపులు ఊరంతటినీ నిద్ర లేపాయి.

"అయ్యో నా తల్లా! ఎంత పని చేశావే... నేను మీవాళ్లకంతా ఏం చెప్పేదే అమ్మా..." అంటూ అత్త శోకాలు పెడుతోంది. "ఈ పాడుబడ్డ రాజకీయాల కోసం ఎవురైనా ఇట్టా చేసుకుంటారా?" అంటూ ఎన్నెన్నో గత విషయాల్ని, కోడలి మంచినీ, ఓర్పునీ చెప్పి రాగాలు తీస్తూ ఏడుస్తోందామె.

'కష్టంలో, సుఖంలో నన్నింటిపెట్టుకొని, నా నిర్లక్ష్యాన్ని భరించి, నా బాధ్యతలన్నీ నెత్తి నేసుకుని, ఈ ఇంటికి జీవంలా ఉన్న నువ్వు, ఇంత హఠాత్తుగా వదిలి వెళ్లిపోతే నేనెట్లా ఉండగలననుకున్నావు? నా రాజకీయాల గొడవలో, ప్రజాసేవనే కీర్తి కండూతితో, నేను నిన్ను పట్టించుకోలేకపోయినా, నిజానికి నువ్వే నా ప్రాణ వాయువ్వి. ఈ తుచ్ఛ రాజకీయం కోసం, ఈ బురద గుంటలో నుండి నన్ను బయటికి లాగడం కోసం, నీ ప్రాణాలర్పించావా రాజేశ్వరీ... ఇక తరతరాలకీ ఈ ఇంట్లో రాజకీయపు గొడవొద్దని కోరావు... వాగ్దానం చేస్తున్నాను. నువ్వు కోరినట్లే జరుగుతుంది' చంద్రారెడ్డి రోదిస్తున్నాడు లోపలా బయటా కూడా.

ఇంక మనకెన్నటికీ రాజకీయం వద్దని కోరుకుంటూ దీనంగా రాజేశ్వరి వ్రాసిపెట్టిన చివరి ఉత్తరం రెపరెపలాడుతూ చంద్రారెడ్డిని దహిస్తోంది. హాస్టల్నుండి పిలిపించబడ్డ కొడుకులిద్దరూ తండ్రిని నేరస్తుడిలా చూస్తూ తల్లి మీదపడి రోదిస్తున్నారు. ఆ రోదన రాతి గుండెల్ని కూడా కరిగించేట్లుగా ఉంది.

ఆరోజు చంద్రారెడ్డి కుటుంబం నుండి ఎవరూ ఓటేయడానికి వెళ్లలేదు.

చితిలో రాజేశ్వరి కాల్తుంటే చింతతో చంద్రారెడ్డి కాలుతున్నాడు. ఎప్పటెప్పటివో సంఘటనలు ఒకదాని తర్వాత మరోటి జ్ఞప్తికొచ్చి అతడ్ని దహిస్తున్నాయి. గత మూడురోజులుగా నిద్రలేని కళ్లు దుఃఖంతో మండుతున్నాయి. కంటిమీదికి కునుకురావడంలేదు. అంత్యక్రియలు జరిగిన తర్వాత కూడా చంద్రారెడ్డిని వదిలి వెళ్లలేక ఆత్మీయులు ఒకరిద్దరు కనిపెట్టుకుని ఉన్నారు.

అప్పటికి రాత్రి ఒంటిగంటయ్యింది. ఒంటరితనాన్ని కలిగించే విచిత్రమైన నిశ్శబ్దమేదో చంద్రారెడ్డి చుట్టూ అలుముకుంది.

ఉన్నట్టుండి ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఎక్కడి నుండో, కలగాపులగమైన కేకలు, మహోత్సాహం, జేజేలు క్రమక్రమంగా కాంపౌండ్‌లోనికి ప్రవేశించి చంద్రారెడ్డిని ముం చెత్తాయి.

"చంద్రారెడ్డి సింహపురి సింహం."

"చంద్రన్నకీ జై."

ఇంటిచుట్టూ ఊళ్లో మూలమూలలా ఔట్లు పేలుతున్నాయి.

స్వీట్లూ, మాలలూ, హర్షాతిరేకంతో పేలుతున్న ఔట్లూ, అడ్డుకోలేనంత వేగంగా ఉంది జన ప్రవాహం... అందులో గోపాల్‌రెడ్డీ, మల్లికార్జునరెడ్డి, హరిబాబు, వీరినాయుడు అంతా ఉన్నారు మళ్లీ...

ఆరోజు ఆ ఇంట్లో శవంలేచిన జాడలేమీ లేవు.

అశోకుడెపుడు బౌద్ధం స్వీకరించాడు?

వందల, వేల మరణాల మీదుగా 'బుద్ధం శరణం గచ్ఛామి'

ఇరుకైన సందుదారి గుండా రాజేశ్వరి బయటికెళ్లిపోయిందేగానీ, రాజకీయం మాత్రం ఆ ఇంట్లో నుండి బయటికెళ్లలేదు.

అమెరికా భారతి, సెప్టెంబరు-డిసెంబరు 2002